నేడు ఆలయ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయ పంచమ వార్షికోత్సవం ఈనెల 25న (నేడు) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ధ్వజారోహణం, కుంకుమార్చన, గణపతి పూజ, మృత్యుంజయ హోమం, తీర్థప్రసాద వితరణ, అమ్మవారి పల్లకీ సేవ తదితర పూజలు ఉంటాయని వారు పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం..

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి జన్మ నక్షత్రం 'శ్రవణం' పురస్కరించుకుని శ్రీవారి మాస కల్యాణాన్ని ఈనెల 25న (నేడు) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నదానం ఉంటుందని, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

ఆలయ ముఖద్వార నిర్మాణానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్, సీసాలబస్తీలో గల వైష్ణవి, దుర్గాదేవి ఆలయ ముఖద్వార నిర్మాణానికి సోమ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకుడు కొలుకుల జైహింద్ తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ వరంలాంటిది



చెక్కులు అందజేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఒరిగంటి వెంకటరమరాజుకు రూ.60 వేలు, జి. లక్ష్మమ్మకు రూ. 35 వేలు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరు కాగా సదరు చెక్కులను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ మొదటి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మల్లారెడ్డి, అంతర్జాతీయ టెబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్‌పర్సన్ వనజా అల్వాలా, డైరెక్టర్లు సంతోష్ పాటిల్, నవీన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు కల్వర్టు పనులు!



జగద్గిరిగుట్ట: షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో కల్వర్ట్ పనులు తుది దశకు చేరాయి. సుమారు రూ. కోటి వ్యయంతో 4 నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఏప్రిల్ 10 లోగా పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మూసాపేట: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న కేపీహెచ్‌బీ బస్టాప్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (50) మూర్ఛ వ్యాధితో కన్పించాడు. గమనించిన పోలీసులు వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈనెల 22న చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగేళ్లుగా నరకమే..!

- భూగర్భ డ్రైనేజీ కోసం తవ్విన అంతర్గత రోడ్లు
- పనులు పూర్తయినా తూతూమంత్రంగా మరమ్మతులు
- రాకపోకలకు బస్తీవాసుల ఇబ్బందులు
- పట్టని సంబంధిత శాఖ అధికారులు



అధ్వానంగా ఉన్న గాంధీనగర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు



గాంధీనగర్ శివాలయం పక్క రోడ్డు..



రోడ్డు నంబర్-3లో రాళ్లు తేలిన రోడ్డు



సిద్ధి వినాయక ఆలయం రోడ్డు..

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనుల కోసం అంతర్గత రోడ్లను తవ్విన అధికారులు తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో బస్తీల్లోని ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో పెరిగిన ఇళ్లకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు జలమండలి ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం అంతర్గత రోడ్లను తవ్వారు. అయితే పనులు పూర్తయినా జీహెచ్ఎంసీ అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకపోవడం, అవసరమున్న చోట్ల నూతన రోడ్లు వేయకపోవడంతో ఛిద్రమైన రోడ్లపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

వినతి పత్రాలు బుట్టదాఖలు..

గాంధీనగర్ బస్తీలోని 2, 3, 6, 7, 8, 16 రోడ్లను నాలుగేళ్ల క్రితం తవ్వి భూగర్భ డ్రైనేజీ లైన్లు వేశారు. అయితే వాటిని పునరుద్ధరించాలని ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రాలు అందజేసినా నిధులు మంజూరయ్యాయి..సాంకేతిక కారణాలతో వేయలేకపోతున్నాం..ఎన్నికల కోడ్ వచ్చిందంటూ ఇలా మాట దాట వేస్తూ తమ వినతులను ఇన్నాళ్లు బుట్ట దాఖలు చేశారని బస్తీవాసులు వాపోతున్నారు.

బస్తీలపై చిన్నచూపు..

గాంధీనగర్-వెంకట్రామిరెడ్డినగర్‌కు వెళ్లే ప్రభుత్వ జడ్పీ పాఠశాల గల్లీ, గాంధీనగర్‌లోని శివాలయం పక్క రోడ్డు, గాంధీనగర్ కమిటీ హాల్ ఎదురుగా ఉన్న గల్లీలను నాలుగేళ్ల క్రితం తవ్వి వదిలేయడంతో రాళ్లు తేలిన రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల ఇదే డివిజన్ పరిధిలోని ఆదర్శ నగర్, ఏపీహెచ్‌బీ కాలనీల్లో రోడ్లు వేసిన అధికారులు తమ బస్తీలపై సవతి తల్లి ప్రేమ చూపెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధితో పాటు అధికారులు స్పందించి గాంధీనగర్‌లోనూ రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించడం లేదు..



తమ కాలనీలో రోడ్లు వేయాలని పలుమార్లు ప్రజావాణి, వార్డు కార్యాలయంలో వినతి పత్రాలు అందజేసినా అధికారులు స్పందించడం లేదు. మా పక్క బస్తీలు, కాలనీల్లో రోడ్లు వేసిన అధికారులు మా ప్రాంతంపై మాత్రం వివక్ష చూపుతున్నారు. ఛిద్రమైన రోడ్లపై వెళ్తుంటే టైర్లు పంక్చర్లు అవుతున్నాయి.. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

–ఆనంద్, గాంధీనగర్

ప్రజావాణిలో 33 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 23 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్ విభాగంపై 11 ఫిర్యాదులు రాగా ఇంజినీరింగ్ 8, శానిటేషన్ 3, ఎలక్ట్రిసిటీ 1 వచ్చాయని వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించినట్లు ఉప కమిషనర్లు మల్లారెడ్డి నరసింహులు తెలిపారు. గతంలో టౌన్ ప్లానింగ్ విభాగం పై వచ్చిన ఫిర్యాదులను పట్టించుకోవడం లేదంటూ పలువురు అధికారులను నిలదీశారు. అంబేద్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న పలు ఇళ్లకు పన్నులు అధికంగా వచ్చాయని అధికారులను కలిసి తగ్గించాలని కోరారు.

వాటర్ వర్క్స్ కార్యాలయంలో 10 ఫిర్యాదులు..

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 10 ఫిర్యాదులు అందాయి. వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి నెలకొన్నదని పరిష్కరించాలని కోరుతూ గాజులరామారం కార్పొరేటర్ శేషగిరి సోమవారం ప్రజావాణిలో జీఎం అశోక్‌కు ఫిర్యాదు చేశారు. డీజీఎంలు మేనేజర్లు, ఎలక్ట్రికల్ మేనేజర్ పాల్గొన్నారు.



జలమండలి జీఎం అశోక్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శేషగిరి

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ఫిర్యాదు చేస్తున్న సామాజికవేత్త రవీందర్‌ముదిరాజ్

సుభాష్‌నగర్: ప్లాస్టిక్ కవర్లు, విస్తర్ల వాడకాన్ని నిషేధించాలని పర్యావరణ, సామాజిక వేత్త కోలా రవీందర్‌ముదిరాజ్ కోరారు. ఈమేరకు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణానికి హితం చేసే బట్ట సంచులు, సాంప్రదాయ విస్తరాకుల వినియోగాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జలమండలి ఎండీని కలిసి గ్రేటర్ పరిధిలోని చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని విన్నవించారు. ఆయన వెంట రాములు, అనిల్ తదితరులు ఉన్నారు.

జేఎన్టీయూహెచ్ విద్యార్థులకు ఉద్యోగాలు

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్, టెక్నాలజీ మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ప్రముఖ సంస్థలో ఉద్యోగాలు లభించాయి. మెటలర్జికల్ విభాగానికి చెందిన 8 మంది విద్యార్థులు ప్రముఖ నేషనల్ రిసోర్సెస్ కంపెనీ వేదాంత లిమిటెడ్‌లో ఉద్యోగాలు పొందారు. ఎంపికైన విద్యార్థులకు రూ.11.45 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ అందుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తో పాటు మెటలర్జీ విభాగాధిపతి డా.బి. రమేశ్ చంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి సురేశ్‌బాబు తదితరులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న జేఎన్టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి, తదితరులు

నీటిని పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జలమండలి అధికారులు, సిబ్బంది

మూసాపేట: నీటిని పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తులో నీటి కొరత ఉండదని జలమండలి మూసాపేట సర్కిల్ డీజీఎం శివ పేర్కొన్నారు. జల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా భరత్‌నగర్‌లో నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ జాకీ, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మొగుళ్ల చెరువును పరిరక్షించాలి

చింతల్: మొగుళ్ల చెరువును పరిరక్షించాలని కోరుతూ బీజేపీ నేతలు గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్-148 పరిధిలోని మొగుళ్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే సుమారు 2000 గజాల స్థలంలో పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల సహకారంతో అక్రమ నిర్మాణాలు చేపట్టి విక్రయించారని గతంలోనే ఫిర్యాదు చేసిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోలేదన్నారు. అక్రమ కట్టడాలు కూల్చివేసి పార్కు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే 30 ఫీట్ల వెడల్పుతో వచ్చే నాలాను పునరుద్ధరించి, ప్రజా అవసరాల కోసం అందమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలని కోరారు. వారం రోజుల్లో బఫర్ జోన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుంటే డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి పై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట రాజా సదానంద, ఆకుల సతీశ్, నల్ల జయశంకర్ గౌడ్, పత్తి సతీశ్, రాజేశ్ చారి, పులి బలరాం, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాపరెడ్డి, శ్యామ్, ఈశ్వర్ రెడ్డి, ఆదిత్య, రామ్ సాయి తదితరులు ఉన్నారు.



ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కార్మికుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించండి

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్మికుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పీఎఫ్ డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మికుల ప్రమేయం లేకుండానే వారి పీఎఫ్ ఖాతాల్లో జమైన సొమ్మును కొంతమంది అక్రమార్కులు అధికారుల అండదండలతో కాజేస్తున్నారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే పీఎఫ్, మున్సిపల్ అధికారులే బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఈ.పెంటయ్య, కార్యదర్శి ఎస్.ఎల్లమ్మ, నాయకులు రాజు, వెంకటమ్మ, మహిపాల్, నారాయణ, చెన్నయ్య, వెంకన్న, శ్రీను, మణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీఎన్ఆర్ వీజేఐఈటీ వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న డా.అనుపమ్ శర్మ

నిజాంపేట్: వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల 30వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డైరెక్టర్ ఫర్ స్పెషల్ ప్రాజెక్ట్స్, డీఆర్‌డీఓ, డా.అనుపమ్ శర్మ హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వయసు పెరిగేకొద్ది జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవాలన్నారు. బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. మంచి అలవాట్లు, ఆలోచనలు, విషయ పరిజ్ఞానం మనిషి ఎదుగుదలకు దోహదపడుతాయన్నారు. విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. కళాశాల ఎదుగుదలలో ఎంతో మంది సహకారం, కృషి ఉందన్నారు. వీఎన్ఆర్ వీజేఐఈటీ ప్రిన్సిపాల్ డా.సి.డి. నాయుడు, డైరెక్టర్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ డా.బి. చెన్నకేశవరావులు కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు.

నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సుభాష్‌నగర్: ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజులరామారం ప్రాథమిక పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు రాధికా, శ్రీజ, ఐశ్వర్యకు సోమవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఓయూ జేఏసీ నేత, కాంగ్రెస్ నాయకుడు దరువు అంజన్న హాజరై మాట్లాడుతూ.. చదువుకోవాలని ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో చాలామంది విద్యార్థులు మధ్యలోనే విద్యను ఆపేస్తున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్కారు బడులకు బదులుగా కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహించిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో పేద విద్యార్థులకు న్యాయం జరిగేలా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నదన్నారు. ట్రస్ట్ కేర్ ఫౌండేషన్ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్రశేఖర్, ఆశాలత, ప్రధానోపాధ్యాయుడు సురేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ట్రస్ట్ కేర్ సంస్థ సభ్యులు

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

నిజాంపేట్ : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మమతా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, డీన్, మెడికల్ సూపరింటెండెంట్, డిప్యూటీ మెడికల్ ఇంటెండెంట్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్, సామాజిక వైద్య శాస్త్ర విభాగపు అధ్యాపకులు, మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, నర్సింగ్, విద్యార్థులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి నివారణ, నిర్మూలనపై పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శిస్తూ, టీబీ రహిత సమాజం కోసం పాటుపడాలని నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ర్యాలీ మమతా మెడికల్ కాలేజీ నుంచి బాచుపల్లి కూడలి వరకు సాగింది.



ర్యాలీ నిర్వహిస్తున్న మమతా అకాడమీ మెడికల్ సిబ్బంది

ఇంటివద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు

మూసాపేట: భద్రాద్రి రాములోరి తలంబ్రాలను ఇంటివద్దకే డెలివరీ చేస్తామని కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ హరి తెలిపారు. కూకట్‌పల్లిలోని డిపోలో భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాల పంపిణీ పోస్టర్‌ను అధికారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాద్రి సీతారాముల కల్యాణం చూడలేకపోయినా తలంబ్రాలను పొందే అవకాశం ఆర్టీసీ కల్పిస్తుందన్నారు. ఒక్కో తలంబ్రాల ప్యాకెట్ ధర. 151 అని, అందులో 2 ముత్యాలు కూడా ఉంటాయన్నారు. 9154298824లో సంప్రదించి బుక్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ రమేశ్, సీనియర్ అసిస్టెంట్ చైతన్య, సీనియర్ అసిస్టెంట్ ఫైనాన్స్ కె.సరిత తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ లేని జిల్లాగా..

- కొత్తగా మూడు మున్సిపాలిటీల ఏర్పాటుపై అసెంబ్లీలో తీర్మానం

రద్దు కానున్న మేడ్చల్-మల్కాజిగిరి జెడ్పీ

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కాబోతోంది. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉండగా, ఇప్పటి వరకు హైదరాబాద్ జిల్లాకు మాత్రమే జెడ్పీ లేదు. తాజాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కూడా జెడ్పీ లేని రెండో జిల్లాగా ఆ జాబితాలో చేరనుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి కొత్తగా ఆవిర్భవించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు మండలాలు.. 62 గ్రామ పంచాయతీలతో కొత్త జిల్లా పరిషత్(జెడ్పీ) ఏర్పాటైంది. ఈ జెడ్పీ పరిధిలో ఐదు మండలాలు మాత్రమే ఉండగా, అతి చిన్న జిల్లా పరిషత్‌గా ఐదుగురు జెడ్పీటీసీలతో పాలకవర్గం ఐదు ఏళ్లపాటు కొనసాగింది. కాంగ్రెస్ సర్కారు ఇటీవల ఐదు మండలాల పరిధిలో 64 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఓఆర్ఆర్ లోపల ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీపంలోని ఏడు పురపాలక సంఘాల్లో విలీనం చేసింది. తాజాగా మిగిలిన 34గ్రామపంచాయతీలను కూడా మూడు పురపాలక సంఘాలుగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఒక తీర్మానం చేశారు. జిల్లా పరిషత్(జెడ్పీ) రద్దు కావడంతో పాటు పూర్తిగా గ్రామ పంచాయతీలు లేని అర్బన్ ప్రాంతంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మారబోతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు మున్సిపల్ సర్కిళ్లతో సహా 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. కొత్తగా పెరుగుతున్న మూడు పురపాలక సంఘాలతో కలిపి జిల్లాలో మొత్తంగా 16పురపాలక సంఘాలు కానున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం కింద కొనసాగనున్న అభివృద్ధి పనులు నిలిచిపోనున్నాయి.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ), ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీ శాఖలు కూడా మాయం కానున్నాయి.

16కు పెరిగిన పురపాలక సంఘాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రస్తుతం 13 పురపాలక సంఘాలు ఉండగా, తాజాగా ఏర్పడనున్న కొత్త మూడు పురపాలక సంఘాలతో కలిపితే.. మొత్తం 16 పురపాలక సంఘాలు కానున్నాయి. ఇందులో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు కాగా, మేడ్చల్, తూముకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, కొంపల్లి, దుండిగల్, కొత్తవి అలియాబాద్, ఎల్లంపేట, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలు ఉన్నాయి.

కొత్త మున్సిపాలిటీలు ఇవే..

మేడ్చల్ జిల్లాలో కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీల్లో ఎంసీ పల్లి, ఎల్లంపేట, అలియాబాద్ ఉండనున్నట్లు తెలుస్తోంది. మూడుచింతలపల్లి(ఎంసీ పల్లి)ల కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో లింగాపూర్, ఉద్దెమర్రి, కేశవరం, నాగిశెట్టిపల్లి, కొల్తూర్, నారాయణపూర్, పోతారం, అనంతారం, లక్ష్మాపూర్, అద్రాస్ పల్లి, జగ్గంగూడ, కేశవపూర్, మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీలు విలీనం కానున్నట్లు తెలుస్తోంది. అలియాబాద్ కేంద్రంగా ఏర్పడనున్న మున్సిపాలిటీలో అలియాబాద్, తుక్కుపల్లి, లాల్గడి మలక్‌పేట్, మజీద్‌పూర్, మురహరిపల్లి, యాదారం, పొన్నాల గ్రామ పంచాయతీలు విలీనం కానున్నాయి. ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోకి ఎల్లంపేట, శ్రీరంగవరం, బండ మాదారం, నూతనకల్, మైసిరెడ్డిపల్లి, కోనాయిపల్లి, సోమారం, రావల్‌కోల్, డబిల్‌పూర, రాజ్ బొల్లారం, ఘన్‌పూర్, సైదోనిగడ్డ తండా, రాజ్ బొల్లారం తండా, లింగాపూర్ గ్రామ పంచాయతీలు రానున్నాయి.



గ్రేటర్ పరిధిలోకి 13 పురపాలికలు..?

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని నిజాంపేట, జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు పోచారం, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ, నాగారం, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట మున్సిపాలిటీలు విలీనం అవుతాయనే చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో సాగుతోంది. కొత్తగా ఏర్పడనున్న మూడు మున్సిపాలిటీలు మినహాయించి, మిగతా 13 పురపాలక సంఘాలు గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపేందుకే.. ఇటీవల ఏడు పురపాలక సంఘాల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలను సర్కారు ఇటీవల విలీనం చేసినట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి జిల్లాలోని 13 పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేసే ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ప్రచారం సాగుతోంది.